క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

హుస్నాబాద్: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం చండీ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజితవెంకన్న, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, దేవాలయ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణగౌడ్, పూదరి చంద్రమోళిగౌడ్, పూదరి శ్రీనివాస్‌తోపాటు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. అర్చకులు తాటికొండ వినమ్ శర్మ, మొగిలిపాలెం శివకుమార్ శర్మ, శ్రవణ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీనర్సింహుడికి మకర తోరణం



మకర తోరణం అందజేసిన సృజన్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సలెంద్రి శివాయంలోని లక్ష్మీనర్సింహస్వామికి మంగళవారం మకర తోరణం బహూకరించారు. చిన్నకోడూరు గ్రామానికి చెందిన పానుగంటి నాగ సృజన్ రూ.25 వేల విలువైన ఆ తోరణాన్ని ఆలయ చైర్మన్ నర్సింహాచారికి అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం



ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అర్బన్ మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ట్రస్మా ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు నరేశ్‌కుమార్, విద్యాసాగర్, రవి, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, కోటి, చిన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా లక్ష్యం సాధిద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో సిద్దిపేట మున్సిపాలిటీ మెరుగైన స్థానం సాధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే సిద్దిపేట మొదటి స్థానంలో ఉండేలా పనిచేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా వార్డు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టీల్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



మాట్లాడుతున్న ప్రభాకర్

దుబ్బాక: స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో మెజార్టీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎన్నికలపై నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, ప్రభారిలు, మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులతో మంగళవారం దుబ్బాకలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లను గెలిపించుకొని మన సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారి, సంతోష్, శ్రీకాంత్, అనిల్‌రెడ్డి, ప్రవీణ్, అమర్, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



రోడ్డుకు రెండువైపులా ఉన్న ధర్మాజీపేట చెరువు

ధర్మాజీపేట రహదారిలో నిత్యం ప్రమాదాలు

- అడుగడుగునా మూలమలుపులు
- రక్షణ కంచెలు, సూచిక బోర్డులు లేవు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కేవలం సింగిల్ రోడ్డు ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల వల్ల ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

రోడ్డుకు రెండువైపులా చెరువు

ధర్మాజీపేటకు వెళ్లేదారిలో సుమారు 500 మీటర్ల మేర రోడ్డుకు రెండు పక్కల చెరువు ఉంది. చెరువులో పడకుండా ఎలాంటి రక్షణ కంచెలు లేకపోవడంతో పెను ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు సమాన ఎత్తులో చెరవు ఉండడంతో ప్రమాదాలు జరిగినప్పుడు చెరువులో పడిప్రాణాలు కొల్పోతున్నారు.

బైకు ప్రమాదంలో చిన్నారి మృతి

ధర్మాజీపేటకు చెందిన లోకని వెంకటేశ్ బైకు అదుపుతప్పటంతో కుటుంబంతో సహా చెరువులో పడిపోయారు. దీంతో వెంకటేశ్, అతడి భార్య అపర్ణ, పెద్ద కూతరు హరి నందన సురక్షితంగా బయటపడ్డారు. కానీ చిన్న కూతరు వినయ నందన చెరువులో మునిగి మృతి చెందింది. ఈ ఘటన గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది.

డబుల్ రోడ్డు కోసం వినతి

ధర్మాజీపేట ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు ఉండడంతో తరుచూ ప్రమాదాలకు గురవుతున్నామని డబుల్ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

రక్షణ కంచెలు లేవు



రహదారి పక్కన రోడ్డుకు రెండు పక్కల దాదాపు 500 మీటర్ల మేర చెరువు అనుకొని ఉంది. ఏ మాత్రం అదుపు తప్పినా వాహనాలు చెరువులో పడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే అక్కడ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి.
– శ్రీకాంత్, ధర్మాజీపేట

సూచిక బోర్డులు కరువు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు ఉన్న చోట అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చెరువు నిండుకుండలా మారడంతో వీధి లైట్లు లేకపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి సమస్యను తీర్చండి.
– సాయిగౌడ్, ధర్మాజీపేట

ప్రమాదకరంగా మలుపులు

దుబ్బాక నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ధర్మాజీపేటకు వెళ్లే ప్రధాన దారిలో అడుగడుగునా మూలమలుపులున్నాయి. సంబంధిత అధికారులు రహదారి వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు మండిపడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పిచ్చి మొక్కలు సైతం ఏపుగా పెరగడంతో ములమలుపులు కనబడక వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు.



రహదారిపై మూలమలపులు

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

- 11 వరకు జరగనున్న ఉత్సవాలు
- పలువురు ప్రముఖుల రాక



ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన యాగశాల

దుబ్బాక: పట్టణంలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు బొడ్రాయి(నాభిశిల, భూలక్ష్మీదేవి) ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. గాంధీ విగ్రహం సమీపంలో ఉన్న పాత బొడ్రాయి ప్రాంతంలోనే కొత్తగా ప్రతిష్ఠించనున్నారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక యాగశాలలతోపాటు ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు.

ప్రముఖుల రాక

ఈ ఉత్సవాలు పీఠాధిపతి మాధవనంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు. వేదపండితులు జయరామశర్మ, రొట్టె రాజమౌళి శర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు వేల సంఖ్యలో ప్రజలు హాజరుకానుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలు ఇలా..

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రతిష్ఠాపన, ఘటాభిషేకం, గ్రామ ప్రదక్షిణ శోభాయాత్ర, 9న గురుపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, ఉపచార పూజలు, 10న గవ్యాంత పూజలు, మూలమంత్ర అధివాస హోమం, మాధవనంద సరస్వతి స్వామిజీ యంత్ర స్పర్శన, అనుగ్రహ భాషణం, 11న ఉదయం బొడ్రాయి ప్రతిష్ఠ, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తారు.

బిల్లులు రాక లబ్ధిదారుల ఇబ్బందులు

సీపీఎం జిల్లా నేత వెంకట్‌మావో



మాట్లాడుతున్న వెంకట్‌మావో

చేర్యాల(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్ మావో ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిల్లుల మంజూరులో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నా ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఇళ్లు పోతాయనే భయంతో అప్పులు చేశారని, బిల్లులు రాకపోతే ఆ అప్పులు తీర్చేదెలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అరుణ్, రాజు, మల్లేశం, ఎల్లయ్య, భాస్కర్, చెందు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు కలెక్టర్ పూజలు



హారతి తీసుకొంటున్న కలెక్టర్ హైమావతి

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం కలెక్టర్ హైమావతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెను పూర్ణకుంభంతో స్వాగతించారు. అమ్మవారికి అర్చనలు చేసి, మల్లికార్జునుడికి రుద్రాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ అమ్మవారి శేష వస్త్రాలతో కలెక్టర్‌ను సత్కరించారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, సీసీ మహేందర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి తిరుపతిరెడ్డి, రవీందర్, మల్లేశం, రాజేంద్రప్రసాద్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు. శరత్ పౌర్ణమి వేడుకల్లో భాగంగా లోక కల్యాణం కోసం పండితులు అమ్మవారికి నవావరణ హవనం నిర్వహించారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు.

ప్రవర్తనా నియమావళి పాటించాలి

- జెడ్పీటీసీ అభ్యర్థుల ఖర్చు రూ.4 లక్షలు
- ఎంపీటీసీలకు రూ.1.50 లక్షలు దాటొద్దు
- ఎంపీడీఓలు



అక్కన్నపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/దౌల్తాబాద్(దుబ్బాక): రెండో సాధారణ పంచాయితీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని ఆయా ఎంపీడీఓలు భానోతు జయరాం, శ్రీనివాసవర్మ, డా.చిలుముల శ్రీనివాస్, సయ్యద్ గఫూర్ ఖాద్రి సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాయలయాల్లో మంగళవారం వారు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తారని చెప్పారు. 13 నుంచి నామినేషన్ల స్వీకరణకు ఎంపీటీసీలకు మూడేసి కౌంటర్లు, జెడ్పీటీసీ ఒక్క కౌంటరు, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీ జనరల్ రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.2,500 డిపాజిట్ చెల్లించాలని, ఎంపీటీసీ జనరల్ రూ.2,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరులకు రూ.1,250 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. అలాగే జెడ్పీటీసీ అభ్యర్థి రూ.4 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలని, ఎంపీటీసీ అభ్యర్థి రూ.1.50 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు పాటించకపోతే అనర్హత వేటు పడుతుందని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ సింహాచలం మధుసూదన్, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, నాయబ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యుటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రావు, ఎంఈఓ రమేశ్, ఎంపీఓ చిలుక కరుణాకర్, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్లు దిలీప్ కుమార్, చంద్రశేఖర్‌రావ్, మిషన్ భగీరథ ఏఈ అభినయ్, ఇన్‌చార్జి ఎంపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఎస్ఐ రవికాంత్‌రావు



విద్యార్థులతో ఎస్ఐ రవికాంత్‌రావు

తొగుట(దుబ్బాక)/దుబ్బాకటౌన్: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని ఎస్ఐ రవికాంత్‌రావు చెప్పారు. తొగుట మండలం ఘనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీ టీమ్ ప్రాముఖ్యం, వివిధ చట్టాలు, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజలి, ఏఎస్ఐ రాంరెడ్డి, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీమ్ లీడర్ ఆస రామారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటుహక్కు వినియోగం, పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆట, పాటలతో అవగాహన కల్పించారు. కళాకారులు నర్సింహులు, బిట్ల ఎల్లం, తుమ్మల ఎల్లం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాతకు మనుమరాలు తలకొరివి..



తాతకు తలకొరివి పట్టిన మనవరాలు పూజ

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్యంతో మృతి చెందిన తాతకు మనవరాలు అన్నీ తానై తలకొరివి పట్టింది. మండలంలోని అల్వాలలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడీల సత్యనారాయణ(70) చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. అతడి ఏకైక కొడుకు రవి కూడా నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో రవి కూతురు పూజ డిగ్రీ చదువుతూనే కొంత కాలంగా తాత దగ్గరే ఉండి సపర్యలు చేస్తోంది. ఈ క్రమంలో మృతి చెందిన తాతను తల్చుకుంటూ కన్నీరు మన్నీరైంది. తాతకు తలకొరివి పట్టి అంత్యక్రియలు పూర్తి చేయడం గ్రామంలో అందరినీ కలచివేసింది.

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

నిరసన తెలిపిన న్యాయవాదులు



సిద్దిపేట కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిద్దిపేటకమాన్/దుబ్బాక/చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/బెజ్జంకి(సిద్దిపేట): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేశ్ అన్నారు. దాడిని నిరసిస్తూ న్యాయవాదులు నల్ల రిబ్బన్‌లు ధరించి సిద్దిపేట కోర్టు ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దాడికి ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్, ప్రవీణ్, యాదగిరి, మల్లేశం, ఫణి కిషోర్, మనోహర్, అశోక్, సూర్యకళ, దయానంద్, నాగపూజ, అరుణ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు భహిష్కరించి నిరసన తెలిపారు. చేర్యాల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బార్ ప్రెసిడెంట్ వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శి ప్రణీత్, కార్యదర్శి సురేష్‌కృష్ణ, న్యాయవాదులు సురేందర్, మనోహర్, మహేందర్‌గౌడ్, ప్రసాద్, అమర్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి మాట్లాడారు. న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, భావ ప్రకటన స్వేచ్ఛపై జరిగిన దాడిగా గుర్తించి దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బెజ్జంకిలో ప్రజా సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, స్వేరోస్, బీసీ, అంబేడ్కర్ సంఘాల నాయకులు పరశురాములు, రాజేశం, శ్రీనివాస్, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇది రాజ్యాంగంపై దాడి..

గజ్వేల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించాలని, కులదురహంకారం, మత అసహనం దేశమంతటా రాజ్యమేలడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గజ్వేల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థ పట్ల, ప్రజాస్వామ్యంపై ఏమాత్రం గౌరవం లేని అనారిక శక్తులు విచ్చలవిడిగా విజృంభిస్తున్నాయని మండిపడ్డారు. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కుమార్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, మాజీ జెడ్పీటీసీ ఎల్లయ్య, దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు పి.ఎల్లయ్య, సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందెబోయిన ఎల్లయ్య, దళిత సంఘాల నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షికి డీసీపీ నివాళి



నివాళులర్పిస్తున్న డీసీపీ కుశాల్కర్

సిద్దిపేటకమాన్: ప్రపంచం ఉన్నంత వరకు వాల్మీకి చరిత్ర ఉంటుందని అదనపు డీసీపీ సీహెచ్ కుశాల్కర్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా పోలీసు కమిషనర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఇచ్చిన స్పూర్తితో అనేక మంది రచయితలు, కవులుగా మరారన్నారు. కార్యక్రమంలో సీఐలు కిరణ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ సరిత



జగదేవ్‌పూర్(గజ్వేల్): మాట్లాడుతున్న సీడీపీఓ

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ సరిత సూచించారు. కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే మండలంలోని దౌలాపూర్ అంగన్‌వీడీ కేంద్రంలోను పోషణమాసం నిర్వహించారు. కార్యక్రమాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీత, సంతోష, పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కిరణ్, వైద్యులు రాజశేఖర్, సత్యప్రకాశ్, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

దాచారంలో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారం వినియోగంపై వారితో ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులకు ఇస్తున్న బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు స్వరూప, పుష్ప, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిలిచిన మురుగు.. సాగేదెలా చదువు

- పాఠశాల ఆవరణలో చేరుతున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బండపల్లి పాఠశాల గేట్ వద్ద మురుగు

చేర్యాల(సిద్దిపేట): గ్రామంలో మురుగు నీరంతా బండపల్లి పాఠశాల ఆవరణలోకే వచ్చి చేరుతోంది. రోజుల తరబడి మురుగు నిలిచిపోవడంతో తాము స్కూల్‌కి వెళ్లేదెలా? చదువు సాగించేదెలా అంటూ విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అధికారుల తీరుపై కాలనీవాసులు మండిపడుతున్నారు. మురుగు నీరు చేరడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రాఘవేంద్ర నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారాంనగర్, ఇందిరానగర్, వడ్డెరకాలనీ, ఎఫ్‌సీఐ గోదాం పరిసరాలు, ఎల్లారెడ్డినగర్, సాయి ఐటీఐ, లెక్చరర్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బియ్యం అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొత్త గౌండ్ల చంద్రవ్వ కుటుంబాన్ని మంగళవారం బహుజన మిత్ర మండలి సభ్యులు పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు.